సాక్షి జగిత్యాల

బుధవారం ၊ 30 ၊ అక్టోబర్ ၊ 2024



నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయాల్లో మొక్కులు చెల్లించారు.



కోటిలింగాల హుండీ లెక్కింపు

వెల్గటూర్: కోటిలింగాలలోని కోటేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఎనిమిది నెలలకు రూ.3,16,519 వచ్చినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/22.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం, రాత్రివేళ చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

బాబ్లీ గేట్లు మూసివేత



బాబ్లీ ప్రాజెక్టు గేట్ల వద్ద త్రిసభ్య కమిటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం: ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్ర భూభాగంలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మంగళవారం త్రిసభ్య కమిటీ సభ్యులు మూసివేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఏటా అక్టోబర్ 29న బాబ్లీగేట్లను మూసివేస్తారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి, డీఈఈ గణేశ్, నాందెడ్ ఈఈ బంసోడ్, సీడబ్ల్యూసీ ఈఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

31న ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న సుతారి రాములు

కోరుట్ల: ఈనెల 31న నిర్వహించే ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. పట్టణంలోని సీ.ప్రభాకర్ భవనంలో మంగళవారం మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాలు, కార్మిక వాడలు, అడ్డాల వద్ద జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఎనిమిది గంటల పని దినం, కనీస వేతనం, పని భద్రతకు కార్మిక వర్గాన్ని ఏకం చేసి పోరాడి చట్టాలు సాధించిన ఏకైక సంఘం ఏఐటీయూసీ అన్నారు. రైల్వే, విమాన, బ్యాంకు, బీమా, విద్యుత్, సింగరేణి, ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతోపాటు అసంఘటిత రంగంలో బీడీ, హమాలీ, అంగన్‌వాడీ, ఆశ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, భవన నిర్మాణ కార్మిక సంఘాలలో బలోపేతమైందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చెన్నా విశ్వనాథం, కొక్కుల శాంత, ఉన్నం రాధ, ఎండీ.మౌలాన, ముఖ్రం, యూసుఫ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తన సాగు పరిశీలన



వరి విత్తన పొలాలను సందర్శిస్తున్న శాస్త్రవేత్తల బృందం

జగిత్యాలఅగ్రికల్చర్: వరి విత్తనాలను సాగు చేసిన అభ్యుదయ రైతుల పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మంగళవారం సందర్శించింది. జగిత్యాల మండలం పొలాస, పొరండ్ల, కన్నాపూర్, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో సాగవుతున్న పొలాలను బృందం సభ్యులు పరిశీలించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పలు పరిశోధన స్థానాల శాస్త్రవేత్తలు రూపొందించిన జేజీఎల్-28639, డబ్ల్యూజీఎల్-1537, డబ్ల్యూజీఎల్-1380, ఆర్‌ఎన్‌ఆర్-35008, కేఎన్‌ఎం-12368, కేఎన్‌ఎం-7715, కేఎన్‌ఎం-12472, కేఎన్‌ఎం-12510, కేఎన్‌ఎం-13555, కేపీఎస్-10631 రకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ కె.మదన్‌మోహన్ రెడ్డి, కూనారం పరిశోధన స్థానం ఇన్‌చార్జి శ్రీధర్ సిద్ది, శాస్త్రవేత్తలు ఉన్నారు. సాగు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వరి రకాలు, వాటి లక్షణాలపై క్షేత్ర సందర్శనలో భాగంగా ఇతర రైతులకు వివరించారు.

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు



ఎంపికైన బాస్కెట్‌బాల్ బాలుర జట్టు

జగిత్యాలటౌన్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 బాస్కెట్‌బాల్ బాలుర జట్లను పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో మంగళవారం ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మీరాంనాయక్ తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీల నిర్వహణలో పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, పీఈటీలు మల్లేశ్వరి, జమున, వెంకటలక్ష్మి, మంగ, శ్రీరాం, సుమంత్, హరీశ్ పాల్గొన్నారు. ముందుగా జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహించి జట్లను ఖరారు చేసినట్లు లక్ష్మీరాంనాయక్ తెలిపారు.

‘జుడా’.. అభివృద్ధి జాడ

జిల్లా మొత్తం ఒకే యూనిట్

- ఐదు బల్దియాలు, 294 రెవెన్యూ గ్రామాలతో ఏర్పాటు
- సులభంగా లభించనున్న అనుమతులు
- ఇప్పటికే జీవో జారీ చేసిన ప్రభుత్వం
- వేగంగా అభివృద్ధి చెందే అవకాశం



జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మ్యాప్

జగిత్యాల: ఇక జిల్లా యూనిట్‌గా జగిత్యాల అభివృద్ధి చెందనుంది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 294 రెవెన్యూ గ్రామాలను విలీనం చేస్తూ.. జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (జుడా) ఏర్పాటు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం గెజిట్ విడుదల చేసింది. జీవో నంబరు 179 ప్రకారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. మారుమూల మండలాలతోపాటు, రెవెన్యూ గ్రామాలను కలుపుతూ జుడా ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపించిన విషయం తెల్సిందే. సాధ్యాసాధ్యాలు పరిశీలించిన అనంతరం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2,419 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం వరకు పంచాయతీలను ఈ జుడా పరిధిలోకి తీసుకున్నారు.

ప్రత్యేక నిధులు

జుడా ఏర్పడనుండగా.. మున్సిపల్ పరిధిలోనే కాకుండా గ్రామాల్లోనూ లేఅవుట్లు ఏర్పాటు చేసిన నివాస స్థలాల్లో భవన నిర్మాణాలకు అవసరమైన అన్ని అనుమతులు సులభంగా లభించే అవకాశాలుంటాయి. అలాగే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, రూరల్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి ప్రత్యేక నిధులు రానున్నాయి. గ్రామాల్లో డ్రెయినేజీలు, రహదారుల వ్యవస్థ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల ఏర్పాటుకు ప్రత్యేక నిధులు కేటాయించనున్నారు. అంతర్గత రోడ్ల విస్తరణ, మొక్కల పెంపకం, జంక్షన్ల అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమృద్ధిగా నిధులు సమకూరే అవకాశం ఉంటుంది. అలాగే దీనికో ప్రత్యేక కమిటీ నియామకం కానుంది. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా.. అదనపు కలెక్టర్లు వైస్ చైర్మన్లుగా వ్యవహరించనున్నారు. డైరెక్టర్ ఆఫ్ కంట్రీప్లానింగ్ అధికారి, పట్టణ అభివృద్ధి సంస్థ పరిధిలోకి వచ్చే లేఅవుట్లు, భవన నిర్మాణంతోపాటు అన్ని కీలక అనుమతులు ఆయన పరిధిలోనే ఉండనున్నాయి. కొన్ని అనుమతులు గ్రామపంచాయతీల ద్వారా ఇవ్వనున్నారు.

డెవలప్‌మెంట్‌కు ఊతం



జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా ఏర్పాటు కానున్న నేపథ్యంలో జిల్లా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. పట్టణాల సుందరీకరణ, పరిశ్రమలు ఏర్పడితే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– మచ్చ శంకర్, ఉపాధ్యాయుడు

జీవో జారీ అభినందనీయం



జుడా ఏర్పాటుకు జీవో జారీ కావడం అభినందనీయం. పట్టణాభివృద్ధి సంస్థ తరహాలో అన్ని మున్సిపాలిటీలు, గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు, మౌలిక వసతులు ఏర్పాటవుతాయి.

– ఏదుల కిరణ్‌కుమార్, జగిత్యాల

ప్రతిపాదనల మేరకు..



జుడా ఏర్పాటు కోసం ఉన్నతాధికారులు అడిగిన మేరకు ప్రతిపాదనలు పంపించాం. తాజాగా జుడా ఏర్పాటుకు జీవో జారీ అయింది. అథారిటీ పరిధిలోకి వచ్చే పట్టణాలు, గ్రామాలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

– సత్యప్రసాద్, కలెక్టర్

కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించాలి

- నవంబర్ ఆరో తేదీ నుంచి ఇంటింటి సర్వే
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల: నవంబర్ ఆరో తేదీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాల అభ్యున్నతికి వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు మెరుగుపర్చేందుకు తగిన ప్రణాళిక కోసం సర్వే ఉపయోగపడుతుందన్నారు. అవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను గుర్తించి శిక్షణ అందించాలని, అధికారులను నియమించాలని ఆదేశించారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ ఉండేలా ఈబీ మ్యాప్ అప్‌డేట్ చేయాలని, 10 ఈబీ బ్లాక్‌లకు డేటా సేకరణ, పర్యవేక్షణకు ఒక సూపర్‌వైజర్ ఉండాలన్నారు. ప్రతి మండలానికో నోడల్‌స్థాయి అధికారిని నియమించాలన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ధరణి పాస్‌బుక్ కుటుంబం వద్ద ఉంచుకునేలా ప్రచారం చేయాలన్నారు. నింపిన షెడ్యూల్ ఫారాలను జాగ్రత్తగా భద్రపర్చాలని, ఇతరుల చేతుల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ కలెక్టర్లు బాధ్యతగా.. స్పష్టంగా సర్వే చేపట్టాలని ఆదేశించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశానికే రోల్‌మోడల్‌గా పనితీరు ఉండాలన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సర్వే పూర్తి చేసిన తర్వాత ఇంటింటికీ స్టిక్కర్ అంటించాలన్నారు. ప్రతి ఇంటి సర్వే పూర్తి చేసి ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని, ధాన్యం దిగుబడి బట్టి గోదాంలను సిద్ధం చేసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గొల్లపల్లి: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని వక్తలు సూచించారు. జగిత్యాల నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గొల్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వాడకంలో యువత ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్, చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సైకాలజిస్ట్ పోలవేని భూమేశ్, ఎక్సైజ్ ఆఫీసర్, నిర్వాహకులు మారం గణేశ్, యూత్ క్లబ్ సభ్యులు సంతోష్, హరీశ్, అభి, కార్తీక్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

గొల్లపల్లి: మండలంలోని 27 గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు రూ.4.32 కోట్లతో వివిధ పనులు చేపట్టారు. వీటిపై పది బృందాలతో డీఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీలు, వీఏలు తనిఖీ చేశారు. ఇందులో రూ.1,41,642 అవకతవకలు గుర్తించినట్లు డీఆర్‌డీవో మదన్‌మోహన్ తెలిపారు. వాటిని అవకతవకలకు పాల్పడిన వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ కందుకూరి కృష్ణారెడ్డి, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో సురేశ్ రెడ్డి, పీఆర్‌ఏఈ ప్రభాకర్, అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, ఏపీవోలు పాల్గొన్నారు.

‘శాతవాహన’కు మరో ఝలక్

- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పీఎఫ్ మూడేళ్లుగా పెండింగ్
- వెంటనే జమ చేయాలన్న ఈపీఎఫ్
- గత వారం వర్సిటీకి లేఖ
- అక్రమాల ఫిర్యాదులపై నత్తనడకన విజిలెన్స్ విచారణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



శాతవాహన యూనివర్సిటీ

శాతవాహన యూనివర్సిటీకి మరో ఝలక్ తగిలింది. కొన్నేళ్లుగా తన పరిధిలో పనిచేసే తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌కు చెల్లించాల్సిన పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్) ఆదేశించింది. ఈ మేరకు గత వారం ఈపీఎఫ్ కరీంనగర్ విభాగం అధికారులు శాతవాహన యూనివర్సిటీకి లేఖ రాశారు. మరోవైపు ప్రస్తుతం విజిలెన్స్ వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గతంలో వర్సిటీలో వెలుగు చూసిన పలు అక్రమాలు, ఫిర్యాదులపై విజిలెన్స్ విభాగం విచారణ నత్తనడకన సాగుతుండటంపై విమర్శలు వస్తున్నాయి.

రూ.లక్షల్లో పెండింగ్?

శాతవాహన యూనివర్సిటీలో దాదాపు 149 మంది వరకు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పని చేస్తున్నారు. నిబంధనల ప్రకారం.. వీరికి పీఎఫ్ ప్రతీనెల చెల్లించాలి. కానీ, 2021 జూన్ నుంచి 2024 ఆగస్టు వరకు వారి ఖాతాల్లో జమకాలేదు. ఈ విషయమై పలువురు ఈపీఎఫ్ కార్యాలయంలో ఫిర్యాదులు చేశారు. స్పందించిన సంస్థ అధికారులు వర్సిటీకి లేఖ రాశారు. ఈపీఎఫ్ యాక్ట్ 1952 ప్రకారం.. మీ వద్ద పనిచేసే ఉద్యోగులకు నెలనెలా ఈపీఎఫ్ చెల్లించాల్సిన బాధ్యత మీదేనని అందులో పేర్కొన్నారు. అలాగే, సిబ్బంది బకాయిలు చెల్లించకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. తదుపరి న్యాయపరమైన చర్యలను నిరోధించేందుకు తాము అడిగిన సంబంధిత పత్రాలను సమర్పించాలని స్పష్టం చేశారు. మొత్తం 36 నెలల పీఎఫ్ బకాయిలు రూ.లక్షల్లో ఉన్నట్లు సమాచారం.

అక్రమాలపై జూన్ 18న ఫిర్యాదు..

ప్రభుత్వం ఏటా అక్టోబర్ 23 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తుంది. ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్సిటీలో విజిలెన్స్ విచారణపై ఉత్కంఠ నెలకొంది. శాతవాహన యూనివర్సిటీ కింద రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల పరిధిలో మొత్తం 120 డిగ్రీ, 28 పీజీ, 23 బీఈడీ, 7 ఎంబీఏ, ఒక ఎంఈడీ కాలేజీ, ఒక బీపీఈడీ కాలేజీ, ఒక లా కాలేజీ ఉన్నాయి. వర్సిటీలో తీసుకున్న పలు నిర్ణయాలు, చేపట్టిన పలు పనుల్లో అక్రమాలు జరిగాయని జూన్ 18న హైదరాబాద్‌లోని విజిలెన్స్ ప్రధాన కార్యాలయంలో కొందరు ఫిర్యాదు చేశారు. విచారణ జరపాలని జిల్లా విజిలెన్స్ కార్యాలయానికి ఆదేశాలు రావడంతో స్థానిక అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. వారికి వచ్చిన 160 పేజీల ఫిర్యాదులో వర్సిటీలో జరిగిన పలు పనులు, వెచ్చించిన నిధులు తదితరాలకు సంబంధించిన వివరాలు గణాంకాలతో సహా ఉన్నాయి. వాటి నిగ్గు తేల్చే పనిలో విజిలెన్స్ అధికారులు ఉన్నారు. సిబ్బంది కొరత, యూనివర్సిటీ అధికారులు సరిగా సహకరించకపోవడంతో విచారణ మందకొడిగా సాగుతున్నట్లు సమాచారం.

చర్యలు ఎప్పుడో?

160 పేజీల ఫిర్యాదులో సివిల్, ఆడిటింగ్, సిబ్బంది నియామకాలు, అర్హతలు తదితరాలకు సంబంధించిన అంశాలు కలగలిసి ఉన్నాయి. అందుకే, విజిలెన్స్ అధికారులు ఈ అంశాన్ని ఆయా రంగాల్లో నిష్ణాతులైన అధికారులకు అప్పగించారు. వారు అధ్యయనం చేసి, వాస్తవాలతో సరిపోల్చి చూడాలి. అనంతరం నిధుల దుర్వినియోగం జరిగిందా? లేదా? అన్న విషయమై వారి అభిప్రాయాలు తెలపాలి. వీటన్నింటినీ క్రోడీకరించిన తర్వాతే అక్రమాల నిగ్గు తేలనుంది. కరోనా సమయంలో టెండర్లు లేకుండా జవాబు పత్రాల మూల్యాంకనం ఓ కంపెనీకి కట్టబెట్టిన తీరు వివాదాస్పదమైంది. దీనివల్ల వర్సిటీకి రూ.కోట్ల భారం పడిందని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. అలాగే, 2021లో వర్సిటీలో జరిగిన డిగ్రీ పరీక్షా పత్రాలన్నీ వాట్సాప్‌లో ముందే ప్రత్యక్షమయ్యాయి. ఈ కేసు ట్రయల్‌లో ఉంది. వర్సిటీ పరిధిలో బోధన, బోధనేతర సిబ్బంది మొత్తం కలిపి 185 మంది అయితే, ఫిబ్రవరి 6న జరిగిన పాలకమండలి సమావేశంలో 410 మందికి వేతనాల ఆమోదం అంశం చేర్చడాన్ని పాలక మండలి సభ్యులే వ్యతిరేకించారు. ఇక, నియామకాలు, పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ విజిలెన్స్ ఎప్పుడు పూర్తి చేస్తుందో, ఎప్పుడు చర్యలుంటాయో వేచిచూడాలి.



వర్సిటీకి ఈపీఎఫ్ అధికారులు రాసిన లేఖ

‘ఖాకీలకే వసూల్ రాజా’ కలకలం!

సదరు అధికారిపై డీజీపీ కార్యాలయం ప్రత్యేక ఆరా

సాక్షి ఎఫెక్ట్..

సాక్షిప్రతినిధి,కరీంనగర్: సొంత సిబ్బంది నుంచి నెలనెలా డబ్బులు వసూలు చేస్తున్న ఉన్నతాధికారి వైనంపై ‘సాక్షి’లో మంగళవారం ప్రచురితమైన కథనం కలకలం రేపుతోంది. ‘ఖాకీలకే వసూల్ రాజా’ అన్న శీర్షికన వచ్చిన ఈ వార్త ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు అధికారులు ఉలిక్కిపడేలా చేసింది. ఉదయం నుంచే ‘సాక్షి’ కార్యాలయానికి ఫోన్లు వెల్లువెత్తాయి. డీజీపీ కార్యాలయం కూడా అయ్యవారి ఆగడాలపై ప్రత్యేకంగా నివేదికకు ఆదేశించినట్లు తెలిసింది. ‘సాక్షి’ కథనంలో ప్రస్తావించిన ఒక్కో అంశాన్ని మరోసారి వెరిఫై చేసే పనిలో నిఘా వర్గాలు ఉన్నాయి. అదే సందర్భంలో సదరు అధికారి గతంలో పనిచేసిన చోట చేసిన ఆగడాలు తిరిగి చర్చకు వస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం కీలకస్థానంలో పనిచేసినప్పుడు సదరు అధికారి పుట్టిన రోజు వేడుకకు ప్రతీ ఎస్‌హెచ్‌వో తులం బంగారం తీసుకురావాలని హుకూం జారీ చేయడాన్ని గుర్తు చేసుకుంటున్నారు. గతంలో ఇదే అధికారి ఆగడాలు, వసూళ్లపై పలు ఫిర్యాదులు రావడంతో ఏసీబీ నిఘా వేసింది. ఈ అధికారికి కుడిభుజంలా ఉన్న కానిస్టేబుల్‌ను పట్టుకుందామని మాటు వేసింది. కానీ, ఇంతలో ఏసీబీలో ఉన్న ఓ కీలక అధికారి బదిలీ కావడంతో ఆ ఆపరేషన్‌ను పక్కనబెట్టారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతలతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: రక్తదానానికి ముందుకు రావాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఏటా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, యువత నుంచి అనూహ్య స్పందన రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మూడు నెలలకోసారి రక్తదానం చేయడం ద్వారా కొత్త రక్తం ఉత్పత్తి అయి ఆరోగ్యంగా ఉంటామన్నారు. మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, పోలీసు అధికారులను అభినందించారు. అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘుచందర్, పట్టణ సీఐ వేణుగోపాల్, ఆర్‌ఐ వేణు, రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ మంచాల కృష్ణ, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల్లో నిబంధనలు పాటించాలి

దీపావళి సందర్భంగా లైసెన్స్ ఉన్నవారే టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. దుకాణాల సమీపంలో జాగ్రత్తలు తీసుకోవాలని, జనవాసాలు లేని ప్రదేశాల్లో మాత్రమే షాపులు పెట్టుకోవాలని తెలిపారు. ఇసుక, నీరు, ఫైర్ ఎక్స్‌ట్రిమిషన్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా బాణాసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు.

ఇంటివద్దకే ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు



ఆర్టీసీ హోండెలివరీ లాజిస్టిక్ సర్వీసెస్

వెల్గటూర్: ఆర్టీసీ కార్గో లాజిస్టిక్ సేవలను జంటనగరాల్లో ఇంటివద్దకే అందించనున్నట్లు కార్గో లాజిస్టిక్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామారావు తెలిపారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి కార్గో లాజిస్టిక్ కేంద్రాల నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో హోం డెలివరీ బుక్ చేసుకున్న పార్సిల్స్ ఇక నుంచి ఇంటివద్ద అందిస్తామన్నారు. హైదరాబాద్‌లోని 31 కేంద్రాలలో హోం డెలివరీ అవకాశం కల్పించామని, పార్సిల్ బుక్ చేసుకునే కస్టమర్లు తప్పకుండా వారి పూర్తి చిరునామా, పిన్‌కోడ్ బుకింగ్ కేంద్రాల వద్ద తెలపాలని సూచించారు. పార్సిల్స్ వేగంగా.. భద్రంగా చేరవేస్తామని, అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు జగిత్యాలలో సురేశ్‌ను 77802 50439, కోరుట్లలో రమేశ్‌ను 91542 98572, మెట్‌పల్లిలో ఉపేందర్‌ను 91542 98574 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సీసీరోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- 13 అంశాలకు రాయికల్ బల్దియా ఆమోదం
- మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు వెల్లడి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు

రాయికల్: రాయికల్ బల్దియాలో సీసీరోడ్ల పనులను వేగవంతం చేయడంతోపాటు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు సూచించారు. మంగళవారం స్థానిక బల్దియా కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో త్వరితగతిన పనులను పూర్తి చేయాలని, నీటి సరఫరా సంబంధిత పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. కౌన్సిలర్లకు బకాయి ఉన్న గౌరవ వేతనం మంజూరు చేయాలని వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం 13 అంశాలపై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు కన్నక మహేందర్, తురగ శ్రీధర్‌రెడ్డి, అన్వరిబేగం, కల్లెడ సునీత, శ్రీరాముల సువర్ణ, మ్యాకల అనురాధ, పెండెల వనిత, మహేందర్‌బాబు, మొరజొద్దీన్, పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


లింగం (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలంలోని దుంపేట గ్రామానికి చెందిన తోట లింగం (66) మంగళవారం పని నిమిత్తం బైక్‌పై తాండ్ర్యాల గ్రామానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా పోసానిపేట శివారులోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింగం తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్ పరిశీలించి, మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతుడి సోదరుడు రాజేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. లింగం కుమారులు ముంబయిలో ఉన్నారని, వారు వచ్చాక బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

జగిత్యాలలో..


సంఘటన స్థలంలో నగేశ్ మృతదేహం

జగిత్యాల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై సదాకర్ కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం గుత్రాజ్‌పల్లికి చెందిన బొద్దుల నగేశ్(35) మంగళవారం పని నిమిత్తం బైక్‌పై జగిత్యాల వచ్చాడు. తిరిగి వెళ్తుండగా జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట శివారులో హనుమాన్ వాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఎదురుగా వచ్చి, ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నగేశ్ కిందపడ్డాడు. అదే సమయంలో ధర్మపురి వైపు వెళ్తున్న లారీ అతని తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో బైక్‌పై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనతో సుమారు గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, నగేశ్ మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

అత్తామామపై దాడి చేసిన అల్లుడి అరెస్టు

కరీంనగర్ క్రైం: అత్తామామపై దాడి చేసిన అల్లుడిని కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన రేఖ, శివకృష్ణ దంపతులు. ఇటీవల ఇద్దరి మధ్య గొడవ జరగడంతో రేఖ పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే, భార్యతో గొడవ జరగడానికి తన అత్తామామ కారణమని, ఆమెను తన వద్దకు పంపడం లేదని శివకృష్ణ వారిపై కోపం పెంచుకున్నాడు. ఈ నెల 28న బైక్‌పై వెళ్తున్న అత్తామామ రెహానా, చున్నులను ఆటోతో ఢీకొట్టాడు. వారి కిందపడగా వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేసి, గాయపరిచాడు. బాధితుల కుమారుడు చాంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శివకృష్ణను మంగళవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

కులగణనకు ఏర్పాట్లు

- ఎన్యుమరేటర్ల నియామకం
- నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్
- వచ్చే నెల 2 లోగా బ్లాక్‌ల సంఖ్య ఖరారు
- ఒక్కోదానిలో 150 కుటుంబాలు ఉండేలా చర్యలు
- వచ్చే నెల 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే


సర్వే నమూనా

2011 జనాభా లెక్కల ప్రకారం
కరీంనగర్ జిల్లా జనాభా : 10,05,711
నివాసాలు : 2,58,485
కుటుంబాలు : 2,90,657

కరీంనగర్ అర్బన్: కులగణనకు ఏర్పాట్లు మొదలయ్యాయి. నవంబర్ 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానుంది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన శిక్షణకు కరీంనగర్ జిల్లా నుంచి ఎంపీవో ఎం.కిరణ్, కె.సురేందర్(డీటీఎం, జెడ్పీ), రమేశ్(ఐఈసీ కన్సల్టెంట్, డీఆర్డీఏ), సతీశ్ (ఏఈ, మున్సిపల్, కరీంనగర్), ఎ.వెంకటేశ్ (సీనియర్ అకౌంటెంట్, మున్సిపల్, కరీంనగర్), సీపీవో కొమురయ్య హాజరయ్యారు. మంగళవారం కలెక్టరేట్‌లో మండల ప్రణాళిక గణాంక అధికారుల (ఎంపీఎస్‌వో)కు శిక్షణనిచ్చారు. నవంబర్ 1, 2వ తేదీల్లోగా బ్లాక్‌ల సంఖ్యను ఖరారు చేయాల్సి ఉండగా, ఆయా మండల కేంద్రాల్లో ఎన్యుమరేటర్లకు శిక్షణనివ్వనున్నారు. ఇప్పటికే ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయులు మినహా మున్సిపల్, పంచాయతీరాజ్, డీఆర్డీఏ, రెవెన్యూ ఉద్యోగులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీఎస్‌వోలు సూపర్‌వైజర్లుగా వ్యవహరించనుండగా ప్రతీ మండలానికి నోడల్ అధికారిగా జిల్లా అధికారులను నియమించనున్నారు.

సమగ్ర కుటుంబ సర్వేలోని అంశాలే..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) నమూనాలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలోని అంశాలే ప్రధానంగా ఉన్నాయి. బుక్‌లెట్‌లో వివరాలు నమోదు చేయాలి. కాగా, మున్సిపాలిటీలు, నూతన మండలాలు, కొత్త మున్సిపాలిటీల పరిధిలో నివాసాలెన్ని, ఎంతమంది సిబ్బంది అవసరమనేది తేల్చారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు ఇచ్చిన ఇంటి నంబర్ల ఆధారంగా బ్లాకులుగా విభజించనున్నారు. 56 అంశాలను పొందుపరచగా సమగ్ర వివరాలు నమోదు చేయనున్నారు. 15 రోజుల పాటు సర్వే జరగనుండగా ఎన్యుమరేటర్లకు ప్యాడ్, పెన్సిల్, బాల్ పాయింట్ పెన్, సీడీ మార్కర్, ఎరేజర్, షార్ప్‌నర్, క్యారీయింగ్ ఫోల్డర్ ఇవ్వనున్నారు.

అనుభవం ఉన్నవారినే నియమించాలి

సర్వేకు జిల్లా నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ వ్యవహరించనున్నారు. ఇక, డేటా నిర్వహణ, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్‌లో అనుభవం ఉన్నవారిని నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. మండలాలకు నోడల్ అధికారులుగా జిల్లా అధికారులను కలెక్టర్ నియమించాలని స్పష్టం చేసింది. ఎన్యుమరేటర్లుగా అనుభవం ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రభుత్వ శాఖల అధికారుల ఎంపికలో కలెక్టర్ నిర్ణయమే అంతిమం.

రుణాలు, ఆస్తులు, రాజకీయ నేపథ్యం..

సర్వేలో పలు అంశాలు పొందుపరచగా పూర్తిగా వ్యక్తిగత వివరాలను సేకరించనున్నారు. ఐదేళ్లుగా ఏమైనా రుణాలు తీసుకున్నారా, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో పాల్గొన్నారా, పశు సంపద, కుటుంబ సభ్యుల స్థిరాస్తి, చరాస్తి వివరాలు, ఇంట్లో నివాస గదుల సంఖ్య వంటి ఆప్షన్లు ఉన్నాయి. నివాస గృహ విస్తీర్ణం, రకం, ఏవైనా పథకాలు లబ్ధి పొందారా, రాజకీయ నేపథ్యం ఉందా, ఏ హోదాలో ఉన్నారు, ఎన్నేళ్లు పని చేశారు, కుటుంబంలో ఎవరైనా వలస వెళ్లారా, దేశం పేరు, ఇతర రాష్ట్రం వెళ్తే రాష్ట్రం పేరు, వలస వెళ్లడానికి కారణం, ఎంత భూమి ఉంది, ధరణి పాస్‌బుక్ ఉంటే నంబర్, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా, కుల వృత్తిలో కొనసాగుతున్నారా, వార్షిక ఆదాయం తదితర అంశాలను పొందుపరచనున్నారు.

మాన్యువల్‌గానే.. పెరగనున్న బ్లాకులు

కులగణనలో నివాసాల సంఖ్యను బట్టి ఎన్యుమరేటర్ బ్లాక్‌ను నిర్ణయిస్తారు. 170 నివాసాలకు ఒక బ్లాక్ కాగా, 2011లో బ్లాక్‌ల సంఖ్యకు అదనంగా పెంచనున్నారు. 13 ఏళ్లలో నివాసాలు భారీగా పెరిగాయి. గత జనగణనలో 388 బ్లాకులుగా లెక్కించగా గంగాధర మండలంలో 89, రామడుగు 104, చొప్పదండి 61, కరీంనగర్ రూరల్-1లో 55, కరీంనగర్ రూరల్-2లో 53, గన్నేరువరం 55, మానకొండూరు-128, తిమ్మాపూర్-83, చిగురుమామిడి-83, సైదాపూర్-79, శంకరపట్నం-81, వీణవంక-91, హుజూరాబాద్-124, జమ్మికుంట-139, ఇల్లందకుంట మండలంలో 69 బ్లాకులు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో కరీంనగర్ 388, చొప్పదండి 26, కొత్తపల్లి 18, హుజూరాబాద్ 46, జమ్మికుంట 73 బ్లాకులుగా ఉండగా, అప్పుడు 150 నివాసాలకు ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేశారు. ఇప్పుడు కులగణనకు 150 కుటుంబాలను ఒక బ్లాక్‌గా నిర్ణయించగా మొత్తంగా 800లకు పైగా బ్లాక్‌ల సంఖ్య ఉండనుంది.

బాలుడి వైద్య ఖర్చులకు రూ.1.29 లక్షలు

- ఫేస్‌బుక్ మిత్రుల ఔదార్యం


బాలుడి తల్లికి డబ్బులు అందిస్తున్న తహసీల్దార్

ధర్మపురి: తాత, చెల్లెతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న ఓ బాలుడి వైద్య ఖర్చులకు ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.29 లక్షలు సాయం అందించి అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన నారవేని కుమార్, మమత దంపతులకు కుమారుడు మల్లికార్జున్, కూతురు శ్రీనిధి ఉన్నారు. కుమార్ ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. మమత పిల్లలను చూసుకుంటూ ఇంట్లోనే ఉంటోంది. ఈ ఏడాది సెప్టెంబర్ 15న ఇద్దరు పిల్లలు వారి తాతతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గంమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో బాలుడి తాత, చెల్లె శ్రీనిధి అక్కడికక్కడే మరణించారు. మల్లికార్జున్ కాలు, చేయి విరిగింది. వైద్యం కోసం రూ.లక్షలు వెచ్చించారు. అయినా ఇంకా డబ్బులు అవసరం పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ ఈనెల 3న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. ఈ మేరకు దాతలు స్పందించి బాలుడి తల్లి బ్యాంకు ఖాతాకు రూ.1.29 లక్షలు విరాళాల రూపంలో అందించారు. రమేశ్ వాటిని స్థానిక తహసీల్దార్ కృష్ణ చైతన్య, యూనియన్ బ్యాంకు మేనేజర్ ఆశీష్ చేతుల మీదుగా మమతకు అందించారు.

గల్ఫ్ బాధితులకు అండగా ప్రభుత్వం

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే

తిమ్మాపూర్(మానకొండూర్): ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి, రకరకాల కారణాలతో అక్కడే మృతిచెందినవారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సౌదీలో మరణించిన చొప్పదండి మండలవాసి కుటుంబానికి మంగళవారం తిమ్మాపూర్‌లో రూ.5 లక్షల పరిహారం చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకుంటున్న తొలి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే తొలి చెక్కును ఇక్కడ అందించామన్నారు. చొప్పదండి మండలంలోని భూపాలపట్నంకు చెందిన పులి అంజయ్య ఈ ఏడాది జూన్ 27న సౌదీ అరేబియాలో చనిపోయాడన్నారు. ఆయన భార్య రేణుకకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, తహసీల్దార్ కాశీచరణ్, మాజీ వైస్ ఎంపీపీ చందు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతి.. ఆస్పత్రి ఎదుట ఆందోళన

జమ్మికుంట(హుజూరాబాద్): ఓ బాలుడు మృతి చెందగా.. తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వైద్యుడి నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని ఆరోపించారు. బాధితుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామానికి సూరం నరేశ్–స్నేహ దంపతులు. వీరి 11 నెలల బాబుకు జ్వరం రావడంతో 2 రోజుల క్రితం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు పిల్లల ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం ఉదయం పరిస్థితి విషమంగా ఉందని, హనుమకొండ తీసుకెళ్లాలని వైద్యుడు సూచించారు. కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో బాబు మృతిచెందాడు. జ్వరం వచ్చిన తమ కుమారుడిని ఆస్పత్రికి తీసుకువస్తే డాక్టర్ నిర్లక్ష్యం చేశారని, ఆ కారణంగానే బాబు చనిపోయాడని తల్లిదండ్రులు ఆరోపించారు. బంధువులతో కలిసి ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. టౌన్ సీఐ రవి అక్కడికి చేరుకొని, బాధితులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వారు ఫిర్యాదు ఇవ్వలేదని సీఐ పేర్కొన్నారు.

పోక్సో కేసులో ఉపాధ్యాయుడి రిమాండ్

జమ్మికుంట(హుజూరాబాద్)/ఓదెల(పెద్దపల్లి): ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ ఉపాధ్యాయుడిని మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన బాలికను స్థానికుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు నామని సత్యనారాయణ జామకాయ ఇస్తానంటూ తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. తర్వాత ఆమె చేతులు పట్టుకొని, అసభ్యంగా ప్రవర్తించాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ టీచర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

సస్పెండ్ చేసిన డీఈవో..

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు సత్యనారాయణ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని పెద్దకొమిర ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్నాడు. పోక్సో కేసు, అరెస్టు విషయం తెలియడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు డీఈవో మాధవి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్టిజన్ సస్పెన్షన్

కొత్తపల్లి(కరీంనగర్): టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని 33/11 కేవీ కొండపలకల సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న ఆర్టిజన్ గ్రేడ్-2 జె.ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ డీఈ ఎం.తిరుపతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6న ఎల్‌సీ(లైన్ క్లియరెన్స్) విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఏఎల్‌ఎం రమేశ్ విద్యుత్ ప్రమాదానికి గురై, అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన విద్యుత్ శాఖ అధికారులు ప్రసాద్ నిర్లక్ష్యం వల్లే ఏఎల్‌ఎం మృతిచెందినట్లు నిర్ధారించారు.

హైదరాబాద్‌కు బాలికల తరలింపు

ముత్తారం(మంథని): మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పాడిదగ్గుతో అస్వస్థతకు గురైన 53 మంది విద్యార్థినుల్లో 45 మందిని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. మిగిలిన ఎనిమిది మందిలో మంగళవారం ముగ్గురిని తమ ఇళ్లకు పంపించివేశారు. సోమవారం రాత్రి నలుగురిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. శ్వాస సమస్య తీవ్రంగా ఉన్న ముగ్గురిని మంగళవారం హైదరాబాద్ తీసుకెళ్లారు.

పోలీసుల నిరసనలపై నిఘా

- ఉమ్మడి జిల్లాలోని ఏఆర్ కానిస్టేబుళ్లు, హోంగార్డులకు మందలింపు?
- నిబంధనలు పాటించాలని సూచనలు

సిరిసిల్ల క్రైం: టీజీఎస్పీ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి నిరసన తెలిపి, ఉన్నతాధికారుల క్రమశిక్షణ చర్యలకు గురైన విషయం విదితమే. ఆ ఆలోచన ఏఆర్ కానిస్టేబుళ్లు, హోంగార్డులకు రాక ముందే సంబంధిత అధికారులు వారిని పిలిచి, మందలించినట్లు తెలిసింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి పోలీసు శాఖలో ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తానంటూ వివిధ విభాగాల పేర్లు చెప్పారు. కానీ, వాటిలో హోంగార్డుల సంక్షేమంపై మాట్లాడలేదని పలువురు హోంగార్డులు వాపోయారు. ఈ నేపథ్యంలో తమ సంక్షేమాన్ని అధికారులకు గుర్తు చేసేలా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించాలని కొన్ని జిల్లాల సీనియర్ హోంగార్డులు ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఈలోగా టీజీఎస్పీ కానిస్టేబుళ్ల ఉద్యమ బాట ప్రారంభం, తర్వాత రెండు రోజుల్లో కొందరి సస్పెన్షన్, ఇంకొందరి డిస్మిస్ ఆర్డర్లతో హోంగార్డుల ఆలోచనకు బ్రేక్ పడిందన్న చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌లో నిరసనలపై నిఘా పెంచిన పోలీసు అధికారులు అదే విధానాన్ని జిల్లాల్లో కొనసాగించాలని సూచించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఏఆర్ కానిస్టేబుళ్లు, హోంగార్డు సంఘాల అధ్యక్షులను పిలిచి, నిరసనలకు వెళ్లరాదని, వెళ్తే క్రమశిక్షణ చర్యలకు గురికాక తప్పదని హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. నిబంధనలు పాటించాలని, యూనిఫాం సర్వీస్‌లో ఉండి, రోడ్డెక్కడం సరికాదని, అలాంటి ఆలోచన చేసేవారిపై నిఘా ఉందని ఓ సీనియర్ పోలీసు అధికారి హోంగార్డులకు సూచించినట్లు తెలిసింది.

ఆలయంలో చోరీ

మెట్‌పల్లి: పట్టణంలోని కాశీభాగ్ హనుమాన్ ఆలయంలో చోరీ జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ చెర్లపల్లి రాజేశ్వర్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియన వ్యక్తి ఆలయ గర్భగుడి తాళం పగులగొట్టి, లోపలికి చొరబడ్డాడని పేర్కొన్నారు. సుమారు రూ.15 వేల విలువైన సామగ్రి ఎత్తుకెళ్లాడన్నారు. ఈ దృశ్యాలన్నీ అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆటో, రెండు బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

ధర్మపురి: ఎదురెదురుగా వస్తున్న ఆటో, రెండు బైకులు ఢీకొట్టుకోవడంతో బైక్‌లపై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన రాగిల్ల నారాయణ, నేరెల్ల తిరుపతిగౌడ్ మంగళవారం రాత్రి ధర్మపురి నుంచి దొంతాపూర్ వెళ్తున్నారు. నక్కలపేట ఇందిరమ్మ కాలనీ వద్దకు చేరుకోగానే.. ఎదురుగా వస్తున్న ఆటో రెండు బైక్‌లను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైకులపై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. రాగిల్ల నారాయణకు తలకు తీవ్రగాయమైంది. కాళ్లు, చేతులకు స్వల్పగాయాలయ్యాయి. తిరుపతి గౌడ్ కాలు ఫ్యాక్చర్ అయినట్లు తెలిపారు. ఇరువురిని 108 అంబులెన్స్‌లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి విక్రేతల పట్టివేత?

జగిత్యాల క్రైం: జగిత్యాల పట్టణ శివారులోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం రాత్రి ఇద్దరు గంజాయి విక్రేతలను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ముగ్గురు వ్యక్తులు బైక్‌పై గంజాయి తరలిస్తుండగా పోలీసులు అప్రమత్తమై ఇద్దరిని పట్టుకోగా, ఒకరు పరారైనట్లు తెలిసింది.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి


వ్యక్తి మృతదేహం

మల్యాల(చొప్పదండి): ఆర్టీసీ బస్సు ఢీకొని, ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మల్యాల మండలంలోని ముత్యంపేట దిగువ కొండగట్టులో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. వేములవాడ డిపోకు చెందిన బస్సు మంగళవారం జగిత్యాల వెళ్తోంది. జగిత్యాల-కరీంనగర్ రహదారిపై దిగువ కొండగట్టు వద్ద రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి(45)ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఆంధ్రప్రదేశ్ వ్యక్తి అని, స్థానికంగా తాపీమేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య


అపర్ణ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): అత్తింటి వేధింపులతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం జగ్గారావుపల్లికి చెందిన అపర్ణకు చందుర్తి మండలం నర్సింగపూర్‌కు చెందిన ఆరెల్లి శంకర్‌తో పదేళ్ల క్రితం ఇచ్చి వివాహం జరిగింది. అపర్ణ తల్లిదండ్రులు పెళ్లి సమయంలో రూ.2 లక్షలతోపాటు ఇతర కట్నకానుకలు ముట్టజెప్పారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో బైక్‌ను కొనివ్వలేకపోయారు. ఈ క్రమంలో అదనంగా రూ.లక్ష కట్నంతోపాటు బైక్ తీసుకురావాలంటూ ఏడాదిగా భర్త శంకర్, అత్త లచ్చవ్వ, మామ రాజయ్య అపర్ణను వేధిస్తున్నారు. 6 నెలల క్రితం కులపెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఆ తర్వాత భర్త వేధింపులు తీవ్రమయ్యాయి. మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన భర్త శంకర్, మరిది బాబూరావు ఆటోలో వేములవాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి ఎనిమిదేళ్ల బాబు, రెండేళ్ల పాప ఉన్నారు. మృతురాలి తల్లి పోశవ్వ ఫిర్యాదుతో అపర్ణ భర్త, అత్తామామలపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఏఎస్సై బాపు పేర్కొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ...


నర్సయ్య(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దండవెన నర్సయ్య(39) మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. నర్సయ్య కొన్నేళ్ల క్రితం మద్యానికి బానిసయ్యాడు. ఏ పనీచేయడంలేదు. ఆరోగ్యం కూడా సహకరించడం లేదు. నాలుగు రోజుల క్రితం బాగా మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె పుట్టింకి వెళ్లింది. ఈక్రమంలో మద్యం మత్తులో ఉన్న నర్సయ్య మనస్థాపానికి గురై జీవితంపై విరక్తి చెందాడు. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకొని ఆత్యహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సింగరేణి కార్మికుడి ...


సర్వర్ హుస్సేన్ (ఫైల్)

రామగిరి(మంథని): మండలంలోని సెంటనరీకాలనీకి చెందిన ఎండీ.సర్వర్ హుస్సేన్(39) అనే సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సర్వర్ హుస్సేన్ ఏపీఏ గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తూ సెంటనరీకాలనీ ఎస్‌టీటూ 1265లో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విధులకు సరిగా వెళ్లడం లేదు. ఈ క్రమంలో మానసిక ఒత్తిడిని తట్టుకోలేక మంగళవారం ఉరేసుకున్నట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు

ఆర్మూర్‌లో ఆత్మకూర్ ఒగ్గు కళాబృందం ప్రదర్శన


ఆర్మూర్‌లో ప్రదర్శన ఇస్తున్న ఒగ్గుకళాబృందం

గొల్లపల్లి: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ బోర్డు కాస్టింగ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కార్యక్రమాన్ని మంగళవారం ఆర్మూర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఇందులో గొల్లపల్లి మండలం ఆత్మకూర్ మల్లికార్జున ఒగ్గు కళాబృందం సభ్యులు పాల్గొని ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో డి.అంజయ్య, కొమురయ్య, రాజశేఖర్, మధు, రాజు, మహేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు స్పందన


ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన సబ్ జూనియర్స్ బాలికల ఎంపిక పోటీలకు స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పలువురిని ఎంపిక చేశారు. అంతకుముందు ఈ పోటీలను పాఠశాల చైర్మన్ సుజిత్ రావు, డైరెక్టర్ శిరీషరావు ప్రారంభించారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వుషు పోటీలు..


వుషు పోటీలను ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి

కరీంనగర్‌లోని ఫండస్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల వుషు పోటీలకు కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి సుమారు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పలువురిని ఎంపిక చేశారు. అంతకుముందు ఈ పోటీలను ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ గోపు పద్మజా ప్రభాకర్, పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.వేణుగోపాల్, టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, వుషు సంఘం కార్యదర్శి బార విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ


క్యూలైన్ ద్వారా దర్శనానికి వెళ్తున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. మధ్యాహ్న సమయంలో రద్దీ విపరీతంగా పెరిగింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, అధికారులు హరిహర నాథ్, రాజేందర్ రెడ్డి, ఉమామహేశ్వర్, చంద్రశేఖర్ సిబ్బంది పర్యవేక్షించారు.

సొమ్మసిల్లి పడిపోయిన భక్తురాలు

అంజన్న దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు క్యూలైన్‌లో సొమ్మసిల్లి పడిపోయింది. బయటకు వద్దామని ప్రయత్నించినా దారి లేకపోవడంతో ఆమెను కుటుంబసభ్యులు భుజాలపైనే దర్శనానికి తీసుకువెళ్లారు. ప్రథమ చికిత్స అందుబాటులో లేకపోవడంతో ఆలయ అధికారుల తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆయిల్‌పాం సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


రైతులకు వివరిస్తున్న అధికారి దేవ ప్రసాద్

సారంగాపూర్: ఆయిల్‌పాం సాగుచేసిన రైతులు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవప్రసాద్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో ఆయిల్‌పాం సాగుచేసిన రైతులతో సమావేశమయ్యారు. జిల్లాలో నాలుగు వేల ఎకరాలకు పైగా ఆయిల్‌పాం సాగుచేసినట్లు వెల్లడించారు. కొత్తగా ఆయిల్‌పాం సాగుచేయాలనుకున్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఒక్క రైతు ఎన్ని ఎకరాలైన సాగు చేసుకోవచ్చని సూచించారు. ఈజీఎస్ ద్వారా మొక్కలకు గుంతలు తీయడానికి అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పాం సాగుచేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీపై డ్రిప్ ఏర్పాటుకు అవకాశం ఉందని, మిగిలిన రైతులకు 90శాతం సబ్సిడీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆయిల్‌పాంలో కొమ్ము పురుగు వస్తోందని, అవసరమైన మందులు పిచికారీ చేయాలన్నారు. ఏఈవో వేముల వెంకటేష్, హార్టికల్చర్ ఫీల్డ్ అసిస్టెంటు మల్లేశం, రైతులు పాల్గొన్నారు.